సాక్షి నల్లగొండ

బుధవారం । 16 । జూలై । 2025



1200 ఏళ్ల నాటి పురాతన బావి

ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి గిరి దుర్గంపై గల కోనేరులో 1200 ఏళ్ల నాటి పురాతన చేద బావి బయటపడింది.

- 10లో



పక్కా ప్లాన్

ఓ మహిళ మరో ఇద్దరితో కలిసి భర్తను కారుతో ఢీకొట్టించి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది.

- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**556.60** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**64,789** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**1,650** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	నిల్
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	**1,650** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి ఉత్తమ అవార్డు



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ రాష్ట్రంలోనే మంచి ఫలితాలు సాధించడంతో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం హైదరాబాద్‌లో ఉత్తమ అవార్డు అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సంవత్సరం కాలంలోనే నల్లగొండ డీసీసీబీని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని ప్రసంసించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ శంకర్‌రావు, రవీందర్రావు, సురేంద్రమోహన్, ఉదయ భాస్కర్ ఉన్నారు.

17న జాబ్ మేళా

నల్లగొండ : నల్లగొండలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు నేరుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, బయోడేటాతో జాబ్‌మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. అర్హత, వేతనం తదితర పూర్తి వివరాలకు 7893420435 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

19న పాత వస్తువుల వేలం

నల్లగొండ : జిల్లా పోలీస్ కార్యాలయంలో పాత వస్తువులను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో ఐరన్ లీడింగ్ చైన్లు, కార్పేట్లు, హెల్మెట్లు, పర్నిచర్, కంప్యూటర్లు, ప్రింటర్లను వేలం వేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు వివరాలకు వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ 8712670169 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తిచేయాలి



మాట్లాడుతున్న నారాయణ్ అమిత్

నల్లగొండ : నిర్దేశించిన సమయంలో మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదేశించారు. నల్లగొండలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన ఎంపీడీఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వనమహోత్సవం కింద గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం, నర్సరీలను చేపట్టడం వంటి కార్యక్రమాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. స్వచ్ఛభారత్ కింద పారిశుద్ధ్యం, ఇందిరమ్మ ఇళ్లల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, వర్మి కంపోస్ట్ తయారీ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ పీడీ రజ్ కుమార్, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, డీపీఓ వెంకయ్య, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు రాకపోతే ఇంటికెళ్లి తీసుకొస్తారు



విద్యార్థిని బైక్‌పై పాఠశాలకు తీసుకెళ్తున్న హెచ్‌ఎం లచ్చిరాం, టీచర్ శ్రీనివాస్

మర్రిగూడ: మర్రిగూడ మండలంలోని దామెర భీనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం, ఉపాధ్యాయుడు కొండ శ్రీనివాస్.. బడికిరాని విద్యార్థుల ఇంటికి వెళ్లి బైక్ తీసుకొస్తారు. విద్యార్థులు గైర్హాజరైతే చాలు వారి ఇంటివెళ్లి రాకపోవడానికి కారణాలు ఏమిటో తల్లిదండ్రులను అడిగి తెలుసుకొని స్వయంగా బైక్‌పై ఎక్కించుకొని వస్తుంటారు. ఈ పాఠశాలలో మొత్తం 89 మంది విద్యార్థులు ఉన్నారు. మంగళవారం ముగ్గురు బడికి రాకపోవడంతో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయుడు ఇద్దరు కలిసి వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు నచ్చజెప్పి బైక్‌పై తీసుకొచ్చారు. స్కూల్‌లో విద్యార్థుల హాజరుశాతం పెంచడమే లక్ష్యంగా తనవంతు కృషి చేస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

గురుకులాల్లో ఎందుకిలా..?

రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

- ఫుడ్ పాయిజన్‌తో పలువురు ఆస్పత్రి పాలు
- పట్టింపులేని సిబ్బంది, అందుబాటులో ఉండని ప్రిన్సిపాళ్లు
- కనిపించని ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- వరుస సంఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో వరుసగా జరుగుతున్న సంఘటనలు కలకలం రేపుతున్నాయి. సోమవారం ఉదయం చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట వద్ద బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థిని సంధ్య(11) పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోగా, అదే రోజు దేవరకొండలోని ఆశ్రమ పాఠశాలలో 40 మంది, మర్రిగూడలోని మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్‌లో 18 మంది విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌తో ఆస్పత్రి పాలయ్యారు. ఇవే కాకుండా మంగళవారం తెలవారు జామున నడిగూడెంలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని తనూష మహాలక్ష్మి క్లాస్‌రూమ్‌లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇలా వరుస సంఘటనలు చోటు చేసుకుంటుండటంతో గురుకులాల్లో అసలు ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈ సంఘటనలతో తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఉండే తమ పిల్లల బాగోగులపై ఆందోళన చెందుతున్నారు.

సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపమే కారణమా?

తూప్రాన్‌పేట బీసీ గురుకుల పాఠశాలలో సంధ్య ఆత్మహత్య చేసుకోవడం వెనుక సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యంతోపాటు భద్రతపరమైన లోపాలు ఉన్నట్లు తెలిసింది. నాలుగంతస్తులు ఉన్న ఆ భవనంపైకి వెళ్లేందుకు ఉన్న మెట్ల వద్ద కనీసం గేటు కూడా లేకపోవడంతోనే ఆ బాలిక భవనంపైకి కిందకి దూకినట్లు అక్కడి సిబ్బంది పేర్కొంటున్నారు. వందల మంది విద్యార్థులు ఉండే గురుకులాల్లో, అందులోనూ బాలికల గురుకులాల్లో కనీస భద్రత చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు రాత్రి వేళలలో పర్యవేక్షించాల్సిన సిబ్బంది కూడా పట్టించుకోకపోవడం వల్లే ఆ సంఘటన జరిగినట్లు తెలిసింది. డ్యూటీల సమయంలో మెళకువతో ఉండాల్సి ఉన్నా వారు నిద్రపోవడం వల్లే బాలిక భవనంపైకి ఎక్కి కిందకు దూకినట్లు సమాచారం. ఇక నడిగూడెం కేజీబీవీలో బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో ఇదే పరిస్థితి నెలకొంది. పైగా తరగతి గదికి తాళం వేయలేదని, దాంతో బాలిక తరగతి గదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు, వార్డెన్లు సరిగ్గా పట్టించుకోకపోవడం, అందుబాటులో ఉండకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఫుడ్ పాయిజన్‌తో దేవరకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు (ఫైల్)



నడిగూడెం కేజీబీవీలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని తనూష మహాలక్ష్మి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి వసుంధర

నాణ్యత లేని భోజనంతో ఆసుపత్రులపాలు

గురుకులాలతోపాటు సంక్షేమ హాస్టళ్లలో అధికారుల పర్యవేక్షణ లోపం, అందుబాటులో ఉండకపోవడం, భోజనం నాణ్యతను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారు. దేవరకొండ, మర్రిగూడ పాఠశాలల్లో ఈ కారణంగానే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. జిల్లాలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో భోజనం నాణ్యతను పట్టించుకునే వారే లేరన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మునుగోడు మండల కేంద్రంలో విద్యార్థులకు వండి పెడుతున్న భోజనం నాణ్యతగా ఉండడం లేదని పలుమార్లు హాస్టల్ తనిఖీకి వెళ్లిన ఎమ్మెల్యే, జిల్లా అధికారులకు విద్యార్థులు మొర పెట్టుకున్నారు. అయినా భోజనంలో మార్పు రావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితి జిల్లా అంతటా ఉంది.

ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

నల్లగొండ : దేవరకొండ మండలం కమలాపూర్ (ముదిగొండ) గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ (పూర్తి అదనపు బాధ్యతలు) ఎ.వేదాద్రిపై కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. హెచ్‌ఎం పర్యవేక్షణ లోపం వల్లే విద్యార్థులను అనారోగ్యం పాలయ్యారని తేలినందున సీసీఏ రూల్స్ ప్రకారం తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని, క్రమశిక్షణ చర్యల ప్రక్రియ పూర్తయ్యేవరకు అమలులో ఉంటాయని తెలిపారు.

ఏడాది కాలంలో జరిగిన పలు ఘటనలు ఇవీ..

- డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గతేడాది జూన్ 3, 4, 5 తేదీల్లో 16 మంది విద్యార్థినులను ఎలుకలు కరవడంతో అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది. ఇప్పటికే అవే గదుల్లో విద్యార్థినులు ఉండాల్సి వస్తోంది.
- గతేడాది దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ గురుకులంలో నిద్రిస్తున్న 13 మంది విద్యార్థులను ఎలుకలు కరవడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.
- పీఏపల్లి మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో గతేడాది డిసెంబరులో బియ్యం సరిగాలేక, అన్నం సరిగా ఉడకకపోవడంతో విద్యార్థినులు భోజనం చేయలేదు. దీంతో నలుగురు విద్యార్థినిలు అస్వస్థతకు గురయ్యారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టూటౌన్ : మహిళలు వ్యాపారాలతో ఆర్థిక సాధికారత సాధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. మంగళవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలపై వారికి అవగాహన కల్పించారు. నిబద్ధతతో వ్యాపారాలను ఏర్పాటు చేసి సమాజంలో పెద్ద వ్యాపార వేత్తలుగా మహిళలు రాణించవచ్చన్నారు. వ్యాపారాల నిర్వహణకు బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం, శిక్షణ అందిస్తుందని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీవి మతోన్మాద రాజకీయాలు

- అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- దేవరకొండలో సీపీఐ జిల్లా మహాసభ



అమరులకు నివాళులర్పిస్తున్న కూనంనేని, ఎమ్మెల్సీ సత్యం, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు

దేవరకొండ : రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి బీజేపీ.. మతోన్మాద రాజకీయాలను రెచ్చగొడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం దేవరకొండలోని మందడి నర్సింహ్మారెడ్డి ప్రాంగణంలో నిర్వహించిన సీపీఐ 23వ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసమానతలు లేని సమాజం నిర్మించడమే కమ్యూనిస్టుల లక్ష్యమని అన్నారు. కమ్యూనిజానికి అంతం లేదని.. మానవ సమాజం ఉన్నంత వరకు కమ్యూనిజం ఉంటుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ లాంటి ఇతర బూర్జువా పార్టీలు వారి ప్రాంతాలకు మాత్రమే పరిమితమని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో 2026మార్చి వరకు మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వరకు చెప్పడం దుర్మార్గమన్నారు. కమ్యూనిస్టులంతా ఒకతాటి పైకి వస్తే దోపిడీ వర్గాల రాజ్యాన్ని కూల్చవచ్చన్నారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు అధిక స్థానాల్లో గెలుపొందాలని ఆకాంక్షించారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిజాన్ని అంతం చేయాలని చేస్తున్న కుట్రలు సమంజసం కాదన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అంతకుముందు సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బొల్లె మంజుల అధ్యక్షతన వహించిన ఈ మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఉజ్జిని యాదగిరిరావు, కాంతయ్య, అంజయ్యనాయక్, పల్లె నర్సింహ, శ్రవణ్‌కుమార్, వీరస్వామి, అంజాచారి, వెంకటరమణ, నర్సింహ పాల్గొన్నారు.

మైనార్టీలకు కాంగ్రెస్ పెద్దపీట

- దర్గా ఘాట్‌రోడ్డుపై రాజకీయాలు సరికాదు
- ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. మతాల పేరుతో, కులాల పేరుతో బీజేపీ ప్రజలను రెచ్చగొడుతుందని, పదేళ్లు పేదలకు బీఆర్ఎస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు. మంగళవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ పట్టణాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు దర్గా ఘాట్ రోడ్డుకు నిధులు మంజూరు చేశారని, దీనిపై ఇతర పార్టీలు రాజకీయం చేయడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పిస్తుందని, హఫీజ్‌ఖాన్‌కు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. 25 సంవత్సరాలుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండతో పాటు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ మధ్య కొంతమంది మతం, కులం పేరుతో గొడవలు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని, ఏ సమస్య ఉన్నా సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఘాట్ రోడ్డుపై అనవసర రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో మైనార్టీ వర్గాల్లో ఎక్కువ మందికి అవకాశం ఇవ్వడంతో పాటు పార్టీని గెలిపించుకున్నామని, అందుకే మైనార్టీలు కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారని అన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నూతనంగా నియామకమైన హఫీజ్ ఖాన్, నాయకులు డాక్టర్ ఎ.ఎ.ఖాన్, ఇంతియాజ్ హుస్సేన్, జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, సమద్, ఇంతియాజ్ అలీ, అమేర్, ఇబ్రహీం, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- మద్రాస్ ఐఐటీ బృందంతో సమావేశం

నల్లగొండ : నీటి వృథాను అరికట్టి.. ప్రయోగాత్మక పద్ధతి ద్వారా సక్రమ నీటి నిర్వహణకు ముందుకొచ్చిన మద్రాస్ ఐఐటీ బృందానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మద్రాస్ ఐఐటీ బృందం, తాగునీటి సరపరా, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్, ఇతర శాఖలు ఐఐటీ బృందానికి సహకరించాలని ఆదేశించారు. బృందం సభ్యులు మాట్లాడుతూ తాగునీటి వృథాను అరికట్టేలా 'ఐ ట్యాంక్' యాప్‌ను రూపొందించి వినియోగిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీపీఓ వెంకయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎం.శాంతకుమారి, మద్రాస్ ఐఐటీ బందం ప్రతినిధి సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

'బుద్ధుడితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన



రామగిరి(నల్లగొండ) : బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నల్లగొండ పట్టణంలోని అలకాపురి కాలనీలోని కోటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో అంబేద్కర్ జీవిత చరిత్ర ఆధారంగా 'బుద్ధుడితో నా ప్రయాణం' నాటికను ప్రదర్శించారు. ప్రేక్షకులు అధిక సంఖ్యలో పాల్గొని నాటకాన్ని తిలకించారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పరంధాములు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంకుహరి, నామ వెంకటేశ్వర్లు, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ మండల ఆంజనేయులు, కన్వీనర్ నూనె విష్ణు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొత్త నగేష్, కోశాధికారి గోలి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

పత్తి రైతుకు చినుకు చింత!

ముఖం చాటేసిన వరుణుడు

- 35 డిగ్రీల పైన నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు
- వాడుతున్న పత్తి మొక్కలు
- ఒక్క మర్రిగూడ మండలంలో అధిక వర్షపాతం నమోదు
- ఏడు మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు
- జిల్లా వ్యాప్తంగా 3,84,641 ఎకరాల్లో పత్తిసాగు

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లాలో వర్షం జాడ కరువైంది. జిల్లా అంతటా ఇప్పటి వరకు 141 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా కేవలం 88.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూలైలోనూ ఎండాకాలాన్ని తలపించేలా ఎండలు మండుతున్నాయి. పది రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలపైన నమోదువుతున్నాయి. ఫలితంగా ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన పత్తిచేలు వాడుబట్టిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఎప్పుడు కురుస్తుందా.. అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కొందరు రైతులు వాడుబడుతున్న తమ పత్తిచేలకు స్ప్రింక్లర్లతో నీటి తడుతు ఇచ్చి మొక్కలను కాపాడుకుంటున్నారు.

3.84 లక్షల ఎకరాల పత్తిసాగు

మృగశిర కార్తెలో నైరుతి రుతుపవనాలు కారణంగా కురిసిన వర్షాలకే వివిధ మండలాల్లో చాలామంది రైతులు ముందస్తుగా పత్తిగింజలు నాటుకున్నారు. ఆ తరువాత ఆరుద్ర కార్తెలో వచ్చిన వర్షాలకు మిగతా రైతులు కూడా పత్తిగింజలు విత్తారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3,84,641 ఎకరాల్లో రైతులు పత్తిపంటను సాగు చేసుకున్నారు. జిల్లా అంతటా పత్తిచేలలో గుంటకలు లోలుకుని, కలుపుతీసుకుని ఎరువులను కూడా పెట్టుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో చేలు పంగ దశలో ఉండగా ఆరుద్ర కార్తెలో గింజలు పెట్టుకున్న ప్రాంతాల్లో నాలుగైదు ఆకుల దశలో ఉన్నాయి.



నిడమనూరు మండలం ఎర్రబెల్లిలో వర్షం లేక ఎదుగుదల లోపించిన పత్తి మొక్కలు



వాడుబట్టిన పత్తిమొక్క

వాడుతున్న మొక్కలు

వారం పది రోజులుగా వరుణుడు మొఖం చాటేయడంతో వాతావరణం ఎండాకాలాన్ని తలపిస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు కూడా పెరిగిపోతున్నాయి. దీంతో వర్షాలు కువకపోవడంతో చాలా ప్రాంతాల్లో పత్తి మొలకలు వాడుబట్టాయి. 17 మండలాల్లో లోటు వర్షపాతం, 7 మండలాల్లో అతిలోటు వర్షపాతం నమొదు కావడంతో ఆయా మండలాల్లో పత్తిచేల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరో వారం రోజుల లోపల వర్షం కురవకపోతే పత్తిచేలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడు కరుణిస్తే తప్ప పత్తిచేలు దక్కవని, తాము పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులుగా నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	ఉష్ణోగ్రత
09	34
10	34.5
11	36.0
12	35.0
13	35.5
14	36.0
15	35.5

వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో..)

ఇప్పటి వరకు కురవాల్సింది	141.9
కురిసిన వర్షం	88.9
లోటు వర్షపాతం మండలాలు	17
అతిలోటు మండలాలు	07

పెరిగిన గరిష్ట ఉష్ణోగ్రతలు

జూలై మాసం వచ్చినప్పటికి ఎండల తీవ్రత తగ్గడం లేదు. జూన్ మొదటి వారంలోనే వర్షాలు పడి ఉష్ణోగ్రతలు తగ్గిపోవాలి. ఈ సంవత్సరం వర్షాలు సరిగా కురవకపోవడంతో గరిష్ట ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల వరకు నమోదై ఎండాకాలాన్ని తలపిస్తున్నాయి. గడిచిన వారం రోజుల నుంచి గమనిస్తే ఈ నెల 9వ తేదీన గరిష్ట ఉష్ణోగ్రతలు 34 డిగ్రీల సెల్సియస్ నమోదుకాగా.. ఇప్పుడు 35 డిగ్రీలు దాటాయి. గాలిలో తేమ కూడా తగ్గడంతో పత్తి మొక్కలు వాడిపోతున్నాయి.

మండలాల వారీగా వర్షపాతం ఇలా..

జిల్లాలో ఒక్క మర్రిగూడ మండలంలోనే సాధారణ కంటే ఎక్కువ వర్షం కురిసింది. చిట్యాల, మునుగోడు, చింతపల్లి, నేరెడుగొమ్ము, కొండమల్లేపల్లి, దేవరకొండ, గుండ్లపల్లి, చందంపేట మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. నార్కట్‌పల్లి, కట్టంగూర్, శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి, తిప్పర్తి, నల్లగొండ, కనగల్, చండూరు, త్రిపురారం, మాడుగులపల్లి, దామరచర్ల, అడవిదేవులపల్లి, పెద్దవూర, పీఏపల్లి, గట్టుప్పల్, గుడిపల్లి మండలాల్లో సాధారణ వర్షంపాతం కంటే లోటు వర్షం కురిసింది. నాంపల్లి, గుర్రంపోడు, అనుముల హాలియా, నిడమనూరు, వేములపల్లి, మిర్యాలగూడ, తిరుమలగిరిసాగర్ మండలాల్లో అతిలోటు వర్షపాతం నమోదైంది.

వర్షంలేక మొక్కలు ఎండుతున్నాయి



పత్తిచేనుకు గుంటుక తోలుకుని ఎరువులు కూడా పెట్టుకున్నాం. పది రోజులుగా వర్షం లేకపోవడంతో పత్తి మొక్కలు వాడుపడుతున్నాయి. వారంలోగా వర్షం రాకపోతే పత్తిచేలు పూర్తిగా ఎండిపోయి పెట్టుబడులు నష్టపోయేలా ఉన్నాం.

– చిమట భిక్షమయ్య, రైతు గుండ్లపల్లి, నల్లగొండ మండలం

క్లుప్తంగా

చెక్కు బౌన్స్ కేసులో మూడు నెలల జైలుశిక్ష

తుంగతుర్తి: చెక్కు బౌన్స్ కేసులో నిందితుడికి మూడు నెలలు జైలుశిక్షతో పాటు నష్టపరిహారం కింద బాధితుడికి రూ.4లక్షలు అందించాలని తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎండీ గౌస్ పాషా మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన మండడి సోమేశ్వర్‌రెడ్డి వద్ద 2017 జనవరి 15న నల్లగొండ మండలం దండంపల్లి గ్రామానికి చెందిన మల్లెబోయిన వీరయ్య రూ.3లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు తీసుకున్న సమయంలో వీరయ్య సోమేశ్వర్‌రెడ్డికి చెక్కు ఇచ్చాడు. కొంతకాలం తర్వాత వీరయ్య అప్పు తిరిగి చెల్లించకపోవడంతో అతడు ఇచ్చిన చెక్కును సోమేశ్వర్‌రెడ్డి బ్యాంకులో వేయగా అకౌంట్‌లో డబ్బులు లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. దీంతో 2017 ఆగస్టు 1వ తేదీన సోమేశ్వర్‌రెడ్డి తుంగతుర్తి కోర్టులో చెక్కు బౌన్స్ కేసు వేశాడు. ఈ కేసు తుది విచారణలో వాదోపవాదాలు విన్న తర్వాత వీరయ్యకు మూడు నెలల జైలుశిక్షతో పాటు రూ.4లక్షలు సోమేశ్వర్‌రెడ్డికి చెల్లించాలని జడ్జి ఎండీ గౌస్ పాషా తీర్పు వెలువరించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


శివ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: అప్పుల బాధతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామానికి చెందిన పల్లెపాటి శివ(25) యాదగిరిగుట్ట ఆలయం కొండ పైన కాంట్రాక్ట్ పద్ధతిలో గార్డెన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శివ గత కొన్నిరోజులుగా అప్పుల బాధతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అడ్డగూడూరు: రోడ్డు దాటుతున్న మహిళను బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన అడ్డగూడూరు మండలం చౌల్లరామారం గ్రామ స్టేజీ వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం చిన్నపడిశాల గ్రామానికి చెందిన బండారు పుష్ప మంగళవారం హైదరాబాద్‌లో ఉంటున్న తన బంధువుల వద్దకు వెళ్లేందుకు గాను బస్సు కోసం చౌల్లరామారం గ్రామ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా.. మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన పెద్ది వీరేష్ బైక్‌పై హైదరాబాద్ నుంచి తన స్వగ్రామానికి వెళ్తూ పుష్పను ఢీకొట్టాడు. ఈ ఘటనలో పుష్ప కాలు విరిగింది. వీరేష్ తల, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

లారీ దగ్ధం


దగ్ధమవుతున్న లారీ

వలిగొండ: షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకొని లారీ దగ్ధమైంది. ఈ ఘటన వలిగొండ మండలం నాతాళ్లగూడెం గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ రఫీసూల్ ప్లాస్టిక్ తయారీకి ఉపయోగించే ముడిసరుకుతో చెన్నైకి వెళ్తుండగా.. సోమవారం అర్ధరాత్రి వలిగొండ మండలం నాతాళ్లగూడెం గ్రామ సమీపంలోకి రాగానే షార్ట్ సర్క్యూట్ కారణంగా లారీకి మంటలంటుకున్నాయి. మంటలు లారీ మొత్తం వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమైంది. లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

ప్రమాదం కాదు.. పక్కా ప్లాన్

- వేధిస్తున్న భర్తను సోదరుడు, ప్రియుడితో కలిసి కారుతో ఢీకొట్టించి హత్య చేయించిన భార్య
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం
- ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు.. పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్

సాక్షి, యాదాద్రి, యాదగిరిగుట్ట: భర్త వేధింపులతో విసిగిపోయిన మహిళ తన సోదరుడు, ప్రియుడితో కలిసి అతడిని కారుతో ఢీకొట్టించి చంపి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. చివరకు పోలీసులకు దొరికిపోయారు. రోడ్డు ప్రమాదంగా భావించిన పోలీసులు ఈ ఘటనపై అనుమానంతో విచారణ చేపట్టగా సంచలన విషయాలు వెలుగుచూశాయి. ఈ కేసుకు సంబంధించిన వివరాలను భువనగిరి డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్ మంగళవారం యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు.

అసలు జరిగింది ఇదీ..

ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన వస్తుపుల స్వామి(36)కి ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన పొట్టిపాక మహేశ్ సోదరి స్వాతితో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. స్వామి భువనగిరిలోని ఓ ట్రాక్టర్ షోరూంలో మేనేజర్‌గా పనిచేసేవాడు. స్వామి భార్య స్వాతి కూడా భువనగిరి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఎస్ఎన్ మోటార్స్‌లో పనిచేసేది. ఆ పక్కనే మార్బుల్ దుకాణంలో పనిచేసే తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన గుంటిపల్లి సాయికుమార్‌తో స్వాతికి పరిచయం ఏర్పడింది. కొంతకాలం తర్వాత స్వాతి పనిచేసే ఎస్ఎన్ మోటార్స్ మూతపడింది. ఈ క్రమంలో స్వాతి పల్లెర్ల గ్రామానికి వచ్చి ఇంటికే పరిమితమైంది. కొన్ని రోజుల తర్వాత స్వామికి భువనగిరి నుంచి మోత్కూరుకు బదిలీ అయ్యింది. ఈ క్రమంలో స్వామి తన భార్య స్వాతిని తాను పనిచేసే ట్రాక్టర్ షోరూంలోనే ఉద్యోగంలో చేర్పించాడు.

గొడవలు ఇలా..

స్వాతి సోదరుడు మహేశ్‌కు ఇద్దరు భార్యలు. మహేష్ మొదటి భార్యతో స్వామి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం మహేష్‌కు తెలియడంతో తన బావ స్వామిపై కోపం పెంచుకున్నాడు. స్వామికి వరుసకు సోదరి అయిన తన భార్యతో సంబంధం పెట్టుకున్న విషయాన్ని మహేష్ స్వాతితో చెప్పాడు. దీంతో స్వాతి తన భర్త స్వామిని నిలదీసింది. నన్నే నిలదీస్తావా అంటూ స్వామి స్వాతిని మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో స్వామి, స్వాతి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే గతేడాది ఫిబ్రవరిలో పని నిమిత్తం మోత్కూరుకు వెళ్లిన సాయికుమార్‌కు అక్కడ స్వాతి కలిసింది. తన భర్త వేధిస్తున్న విషయాన్ని స్వాతి సాయికుమార్‌కు వివరించింది. సాయికుమార్ స్వాతిని ఓదార్చాడు. ఈ క్రమంలో వారి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. అయితే అక్క స్వాతి, సాయికుమార్ వివాహేతర సంబంధానికి మహేష్ కూడా సహకరించాడు. తమను వేధిస్తున్న స్వామిపై ఎలాగైనా పగ తీర్చుకోవాలని స్వాతి, మహేష్ నిర్ణయించుకున్నారు.

వాట్సాప్ గ్రూపు ఏర్పాటు

స్వామిని హత్య చేయడానికి సాయికుమార్, స్వాతి, మహేష్ ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. మూడు నెలలుగా వాట్సాప్ గ్రూపులోనే మాట్లాడుకుని తర్వాత కాల్స్ డిలీట్ చేసేవారు. స్వాతి తన ప్రియుడు సాయికుమార్ నంబర్‌ను కూడా సెల్‌ఫోన్‌లో ఫీడ్ చేసుకోలేదు.

కారు అద్దెకు తీసుకుని..

ఈ నెల 13న తన భర్త స్వామి భువనగిరికి పనిమీద వస్తున్న విషయాన్ని స్వాతి.. సాయికుమార్, మహేష్‌కు చెప్పింది. దీంతో వారు స్వామి కదలికలపై భువనగిరిలో నిఘా పెట్టారు. స్వామిని హత్య చేయడానికి పథకం ప్రకారం సాయికుమార్.. తన స్నేహితుడైన భువనగిరి పట్టణంలోని తాతానగర్‌కు చెందిన చీమల రామలింగస్వామి సహాయంతో భువనగిరిలో కారును సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో అద్దెకు తీసుకున్నారు. స్వామి భువనగిరిలో పని ముగించుకుని రాత్రి వేళ తన స్నేహితుడు మద్దికుంట వీరబాబుతో కలిసి బైక్‌పై పల్లెర్ల గ్రామానికి బయల్దేరాడు. స్వామిని సాయికుమార్ కారులో వెంబడించాడు. రాత్రి 11.15 గంటల సమయంలో మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామ శివారులోకి రాగానే కారుతో బైక్‌ను ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకుపోయారు. రోడ్డు పక్కన ఉన్న వేప చెట్టును ఢీకొట్టడంతో స్వామి అక్కడికక్కడే మృతిచెందగా.. బైక్‌పై వెనుక కూర్చున్న వీరబాబుకు గాయాలయ్యాయి. కారు అతివేగంగా వెళ్లి బైక్‌ను ఢీకొట్టిన అనంతరం కంట్రోల్ కాలేదు. రోడ్డు కిందకు 50 మీటర్ల వరకు దూసుకుపోయింది. అక్కడ ఫెన్సింగ్ కడీలకు తగిలి ముందుకు కదలకుండా ఆగిపోయింది. సాయికుమార్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. స్వామిని హత్య చేసేందుకు ప్లాన్ అమలు చేస్తున్న సమయంలో మహేష్, స్వాతి, సాయికుమార్ వాట్సాప్ గ్రూప్ కాల్‌లో మాట్లాడుకున్నారు. వాట్సాప్ కాల్‌లో స్వామిని కారుతో ఢీకొట్టి చంపేశామన్న విషయం సాయికుమార్ ద్వారా తెలుసుకున్న స్వాతి తమ్ముడు మహేశ్ ద్విచక్ర వాహనంపై ఘటనా స్థలానికి చేరుకున్నాడు. అక్కడ ఉన్న సాయికుమార్, రామలింగస్వామిని బైక్‌పై ఎక్కించుకుని భువనగిరి రైల్వే స్టేషన్ వద్ద వదిలేశాడు.

ఆస్పత్రికి వచ్చిన భార్య, బావమరిది

ఘటనా స్థలంలో స్వామి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు అంబులెన్స్‌లో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తుల ద్వారా ఫోన్‌లో విషయం తెలుసుకున్న స్వాతి, మహేష్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఏడుస్తూ అందరినీ నమ్మించే ప్రయత్నం చేశారు.

నిందితుల అరెస్ట్

గుంటి సాయికుమార్, స్వాతి, పొట్టిపాక మహేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్ తెలిపారు. మరో నిందితుడు చీమల రామలింగస్వామి పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, రూరల్ సీఐ శంకర్ గౌడ్, మోటకొండూర్ ఎస్ఐ ఉపేందర్‌యాదవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కారుతో.. కదిలిన డొంక

రోడ్డు ప్రమాదం జరిగినట్లు సమాచారం అందుకున్న మోటకొండూర్ ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రోడ్డు పక్కన ఆగిపోయిన కారును చూసిన పోలీసులకు అనుమానం వచ్చింది. కారులో ముందు భాగం దెబ్బతినడంతో కారు నంబర్ ఆధారంగా కారు యజమానికి ఫోన్ చేసి విచారించగా.. సాయికుమార్ సెల్ఫ్ డ్రైవింగ్ కోసం కారు అద్దెకు తీసుకెళ్లాడని సమాచారం ఇచ్చాడు. దీంతో సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు ఇచ్చాడు. సాయికుమార్ సెల్‌ఫోన్ చెక్ చేయగా స్వాతి నంబర్ కనిపించింది. దీంతో స్వాతిని తీసుకొచ్చి విచారించగా అసలు విషయం బయటపడింది. అయితే నిందితులు స్వామి కాళ్లు, చేతులు విరిచి దివ్యాంగుడిని చేయాలనుకున్నారని తెలిసింది. అయితే అదికాస్త వికటించి అతడు మృతిచెందాడు.

స్వాతంత్య్ర సమరయోధుడు నర్సయ్య కన్నుమూత


నర్సయ్య (ఫైల్)

పెన్‌పహాడ్: మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు గుండు నర్సయ్య(93) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు సంతానం. నర్సయ్య మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, భూక్య సందీప్‌రాథోడ్, మామిడి కరుణాకర్, కిన్నెర ఉప్పలయ్య, తదితరులు నివాళులర్పించారు.

కౌలు రైతు ఆత్మహత్య


యాదయ్య (ఫైల్)

కట్టంగూర్: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన మాతంగి యాదయ్య (57) తనకున్న ఎకరం భూమితో పాటు మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగుచేశాడు. రెండు సంవత్సరాలుగా కాలం కలిసి రాక పంట దిగుబడి రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. ప్రస్తుతం పత్తి చేను ఎండిపోవటంతో మనోవేదనకు గురయ్యాడు. వారం రోజులుగా ఇంట్లో కుటుంబ సభ్యులతో అప్పులు పెరిగిపోయాయని చెప్పాడు. మంగళవారం ఇంటి వరండాలోని ఐరన్ పైపునకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాలడ్డాడు. సాయంత్రం యాదయ్య భార్య ఇంటికి వచ్చి చూసేసరికి ఉరికి వేలాడుతూ కనిపించాడు. రూ.6 లక్షలు అప్పు చేసినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- ఎల్‌సీ తీసుకోకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం



గోవర్ధన్ (ఫైల్)

చిలుకూరు: ఎల్‌సీ తీసుకోకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తూ విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన దాసి గోవర్ధన్(28) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అదే గ్రామానికి చెందిన గండు వెంకన్న పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయడానికి గోవర్ధన్ వెళ్లాడు. ఎల్‌సీ తీసుకోకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఫ్యూజులు తీసివేసి మరమ్మతులు చేస్తుండగా పక్కనే ఉన్న 11కెవీ విద్యుత్ లైన్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై గోవర్ధన్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. విద్యుత్ సిబ్బంది కూడా ఈ ప్రమాదంపై విచారణ చేస్తున్నారు. మృతుడి బావ శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురభి రాంబాబు గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చెరువులో పడి బాలిక..

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామంలో చెరువులో మునిగి బాలిక మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. నూతనకల్ మండలానికి చెందిన వెంకన్న, ఐలమ్మ దంపతుల కుమార్తె సిరి(8) తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామంలో ఉంటున్న తన పెద్దమ్మ కొమ్ము ముత్తమ్మ ఇంటికి మూడు రోజుల క్రితం వచ్చింది. మంగళవారం సాయంత్రం సిరి తోటి బాలికతో కలిసి గ్రామంలోని చెరువు పక్కనే ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు జారి చెరువులో పడి మృతిచెందింది.

• ఉండ్రుగొండలో 1200 ఏళ్ల నాటి పురాతన బావి


ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

చివ్వెంల మండలం ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి గిరి దుర్గంపై గల కోనేరులో ఇటీవల చేపట్టిన తవ్వకాల్లో 1200 ఏళ్ల నాటి చేద బావి బయటపడింది. ఈ బావి చుట్టూ రాళ్లతో గోడ కడుతున్నారు. ఇక నుంచి ఈ బావి నీటితోనే స్వామివారి విగ్రహాలకు జలాభిషేకం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులుతెలిపారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట


తవ్వకాల్లో బయటపడ్డ పురాతన చేద బావి చుట్టూ రాయితో కట్టిన గోడ

రైలు ఢీకొని దుర్మరణం

భువనగిరి: రైల్వే గేటు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి పట్టణంలో మంగళవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన గోపికృష్ణ(62) మంగళవారం స్థానిక అర్బన్ కాలనీలో ఉంటున్న తన బంధువుల నివాసానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అర్బన్ కాలనీకి వెళ్లే మార్గంలో రైల్వే గేటు దాటుతుండగా అతడిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ క్రిష్టారావు తెలిపారు.

రైల్లో నుంచి జారిపడి..

చిట్యాల: చిట్యాల–రామన్నపేట రైల్వే మార్గంలో రైలు పట్టాల పక్కన యువకుడి మృతదేహాన్ని మంగళవారం సాయంత్రం నల్లగొండ రైల్వే పోలీసులు గుర్తించారు. రైలులో నుంచి యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి ఉండవచ్చని నల్లగొండ రైల్వే ఎస్ఐ బి. రామకృష్ణ తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయని, మృతదేహం కుళ్లిన స్థితిలో ఉందని ఆయన పేర్కొన్నారు. నల్లగొండ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

- ఏడుగురికి గాయాలు

చౌటుప్పల్: అతివేగంగా వచ్చిన లారీ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామం నుంచి శెట్టి నాగరాజు అనే వ్యక్తి తన ఆటోలో ఐదుగురు వ్యక్తులను ఎక్కించుకొని చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని అమ్మానాన్న అనాథాశ్రమానికి వెళ్తున్నాడు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టుకుంటూ ముందున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ శెట్టి నాగరాజు, ఆటోలో ప్రయాణిస్తున్న గుంపెల్లి స్రవంతి, బాగం కవిత, ఉమ్మిత్తుల కోటేశ్వరి, కానుగుల విష్ణు, గడ్డం నవీన్‌రెడ్డితో పాటు స్థానికంగా ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు గూడు దూబేలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యంత్రాల సాయంతో అధిక దిగుబడులు సాధ్యం


వరి విత్తనాలు నాటే యంత్రం గురించి వివరిస్తున్న వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్


డ్రోన్‌తో వరి విత్తనాలు చల్లే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

- నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్
- ఉమ్మడి జిల్లా రైతులకు వరి విత్తనాలు విత్తే విధానంపై అవగాహన

త్రిపురారం: రైతులు యంత్రాల సాయంతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చని నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం త్రిపురారం మండలం కంపాసాగర్‌లోని వరి పరిశోధనా స్థానంలో ఉమ్మడి జిల్లాలోని రైతులకు వ్యవసాయంలో నేరుగా పొడి దుక్కిలో వరి విత్తనాలు విత్తే విధానం, దమ్ము చేసిన పొలంలో నేరుగా డ్రోన్ సహాయంతో విత్తనాలు చల్లే పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రోజురోజుకు కూలీల కొరత రైతులకు ఇబ్బందిగా మారిందని, వరి విత్తనాలు నేరుగా చల్లడం వలన కూలీల కొరతను అధిగమించడంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. సకాలంలో వరి విత్తనాలను యంత్రాలతో విత్తుకోవడం వల్ల సమయం కూడా ఆదా అవుతుందన్నారు. శాస్త్రవేత్తల సహాయంతో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే విధంగా రైతులు సాగు చేపట్టాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవాలని అన్నారు. పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు వరి నారు పెంచడం, రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, వరి సాగులో సస్యరక్షణ చర్యలపై సమగ్రంగా వివరించారు. అనంతరం వరి విత్తనాలు నేరుగా దుక్కిలో విత్తే యంత్రం, డోన్ ద్వారా విత్తే పద్ధతులపై శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో యంత్రాలు చూపించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వరి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లింగయ్య, హాలియా సహాయ వ్యవసాయ సంచాలకురాలు సరిత, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి పార్వతి చౌహాన్, శాస్త్రవేత్తలు సంధ్యారాణి, నళిని, స్వాతి, ఏఈఓ నాగరాజు, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఎకరానికి 6కిలోల విత్తనం సరిపోతుంది..

వరి పంటను నేరుగా విత్తేందుకు గాను ఎకరానికి 6కిలోల విత్తనం సరిపోతుందని వరి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లింగయ్య సూచించారు. యంత్రాల సాయంతో ఎకరం పొలంలో 10 నుంచి 15 నిమిషాల్లో వరి విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. వరి పరిశోధనా స్థానం కంపాసాగర్‌లో గత రెండళ్ల నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో నేరుగా వరి విత్తే పద్ధతి, డ్రోన్ సహాయంతో విత్తే పద్ధతులపై పరిశోధనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సహాయంతో రైతులు వరిని నేరుగా విత్తుకోవచ్చని, రైతులు యాంత్రీకరణకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ గౌడ్

సూర్యాపేట : అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు లీగల్ సెల్ కృషి చేస్తుందని పీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పీసీసీ లీగల్ సెల్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అహర్నిశలు పాటుపడుతోందన్నారు. సమాజానికి అండగా ఉంటూ హక్కుల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉమాశంకర్, రాష్ట్ర సెక్రటరీ మూమిన్ రోషన్, రాష్ట్ర కన్వీనర్ నిమ్మరబోయిన నవీన్, ఏ ఎల్‌యూ జిల్లా సెక్రటరీ సీనపల్లి సోమేశ్వర్, మారపాక వెంకన్న, షఫీ ఉల్లా, బత్తిని వెంకటేశ్వర్లు, ఈశ్వర్ కుమార్, టేకులపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో గంజాయి రవాణాపై నిఘా

ఆలేరు: రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు మంగళవారం ఆలేరు రైల్వేస్టేషన్‌లో సివిల్, ఆబ్కారీ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, మెమూ ప్యాంజిర్ బోగీల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనంతరం ప్లాట్‌ఫారంపై పలువురి ప్రయాణికుల బ్యాగ్‌లు, సంచులను పరిశీలించారు. రైళ్లలో గంజాయి రవాణాను అరికట్టేందుకే తనిఖీలు చేపట్టామని సీఐ కొండల్‌రావు చెప్పారు. రైళ్లలో గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందన్నారు. రైళ్లలో అనుమానంగా ఉండే వ్యక్తులు, సీట్ల కింద వస్తువులు, ప్యాకెట్‌లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆలేరు, యాదగిరిగుట్ట, గుండాల ఎస్ఐలు వినయ్, కృష్ణప్రసాద్, శ్రీరాములు, సైదులు, ఆబ్కారీ సీఐ దీపిక పాల్గొన్నారు.


ఆలేరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ కొండల్‌రావు

రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు ప్రారంభం


నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న తడకమళ్ల రామచంద్రరావు తదితరులు


'స్వప్నం రాల్చిన అమృతం' నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు


'ఈ మంచం నాది కాదు' నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ సహకారంతో నల్లగొండ కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నాటకోత్సవాలను తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు ప్రారంభించారు. మొదటిరోజు కరీంనగర్ చైతన్య కళాభారతి వారు స్వప్నం రాల్చిన అమృతం అనే నాటిక, హైదరాబాద్ శ్రీ కళానికేతన్ వారు ఈ మంచం నాది కాదు అనే నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొలనుపాక రవికుమార్, ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు జి. వెంకట్‌రెడ్డి, సెక్రటరీ జెల్లా శ్రీశైలం, కోమలి కళాసమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, సెక్రటరీ ఎంఎల్. నర్సింహారావు, రఘుపతి, జీఎల్. కుమార్, వి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.